క్లుప్తంగా

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపికలు



ఎంపికల్లో భాగంగా హైజంప్ చేస్తున్న విద్యార్థి

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్ ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరై లాంగ్ జంప్, రన్నింగ్, హైజంప్, జావెలిన్‌త్రో తదితర క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించారు. బి.నారాయణరావు, కె.కె.రామిరెడ్డి, జి.శ్రీనివాస్ ఎస్.రాజా, నీలయ్య, జగదీష్, రమేష్ తో పాటు మరికొంత మంది వ్యాయామ ఉపాధ్యాయులంతా ఎంపికలను పర్యవేక్షించారు.

రద్దు చేసిన కార్మిక చట్టాలను అమలు చేయాలి



టెక్కలిలో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

టెక్కలి: ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా రద్దు చేసిందని.. వాటిని తక్షణమే తిరిగి అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో మంగళవారం టెక్కలిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, భద్రతకు రూపకల్పన చేసిన చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రద్దు చేశారన్నారు. ఇటీవల బడ్జెట్‌లో సైతం కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎన్.షణ్ముఖరావు, బి.వాసుదేవరావు, టి.అప్పన్న, గిరిబాబు, హెచ్.భాస్కర్, మల్లేష్, గోపాల్, ఎండయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధ్యాయుల ప్రచారం

టెక్కలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ముమ్మరంగా ప్రచారాలు చేస్తున్నారు. యూటీఎఫ్ బలపరచిన పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీను గెలిపించాలని కోరుతూ పట్టణంలో మంగళవారం పలు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఆమెను గెలిపించాలని కె.దాలయ్య, టి.వైకుంఠరావు, పి.ధర్మారావు, ఎస్.కృష్ణారావు, ఆర్.వి జయకుమార్ తదితరులు విజ్ఞప్తి చేశారు. అలాగే రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మను మరోసారి పట్టం కట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కోటబొమ్మాళి మండలంలో ప్రచారాలు చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కన్వీనర్ లఖినాన కరుణాకర్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న నిమ్మన దాస్

సోంపేట: క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సంస్కారభారతి కళాశాల కరస్పాండెంట్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందస్తు గుర్తింపుతో వ్యాధిని త్వరగా నయం చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎన్ని దేవరాజు, ప్రిన్సిపాల్ బి.శ్రీరామమూర్తి, ఏవో పాపారావు ఉన్నారు.


తిలక్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



టెక్కలి: అన్నదానం చేస్తున్న దృశ్యం

టెక్కలి: వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో సత్యసాయి నిత్యాన్నపూర్ణ సేవా కార్యక్రమం ద్వారా రోగులతో పాటు వారి సహాయకులకు అన్నదానం చేశారు.

జగన్నాథునికి వెండి ఆభరణాలు వితరణ



కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం కవిటిలో వెలసిన జగన్నాథస్వామికి స్థానిక శివచింతామణి పాన్‌షాప్ వర్తక సంఘం సభ్యులు రూ.1.30 లక్షల విలువైన వెండి ఆభరణాలను బహూకరించారు. వీటిని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వర్తకసంఘం ప్రతినిధుల సమక్షంలో సామివారి చేతులకు మంగళవారం అలంకరించారు.

అమ్మో.. మలుపులు!

- జాతీయ రహదారిపై ప్రమాదకరంగా మలుపులు
- కనిపించని సూచీబోర్డులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



ఈదుపురం-బెల్లుపడ కూడలిలో కనపడని సూచీ బోర్డులు



ఇచ్ఛాపురం పట్టణంలోకి వచ్చే జాతీయరహదారి-16 కూడలిలో అడ్డదిడ్డంగా రోడ్డును దాటుతున్న వాహనాలు

ఇచ్ఛాపురం: నియోజకవర్గ కేంద్రం ఇచ్ఛాపురం పట్టణంలోనికి రావాలంటే జనం భయంతో వణికిపోతున్నారు. జాతీయ రహదారి నుంచి పట్టణ రోడ్లను కలిపే కూడళ్లు, మలుపులు ప్రమాదకరంగా ఉండడమే ఈ పరిస్థితి కారణం. ఆయా ప్రదేశాల్లో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ఈ రోడ్లపై తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం నివారణ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మలుపుల వద్ద కనీసం స్పీడ్ బ్రేకర్లు, సూచీబోర్డులు, కూడళ్లలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. గతంలో పాతజాతీయ రహదారి నుంచి బాహుదా బ్రిడ్జి (పాతవంతెన)మార్గం ద్వారా పట్టణంలోనికి వచ్చేవారు. అ వంతెన రెండు సంవత్సరాల క్రితం కూలిపోవడంతో జాతీయ రహదారి-16 నుంచి నేరుగా బెల్లుపడ గ్రామం మీదుగా వస్తున్నారు. ఈ మార్గం నిత్యం రద్దీగా మారింది.

జాతీయ రహదారి-16 నుంచి వచ్చే నాలుగురోడ్ల కూడలిలో రోడ్లను దాటుతూ చాలామంది మృత్యువాత పడగా చాలామంది అంగవైకల్యానికి గురయ్యారు. నాలుగురోడ్ల కూడలిలో ఎటువంటి సూచిబోర్డులుగాని, జాతీయ రహదారిని కలిపే రోడ్లపై సరైన స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాట్లు వంటివి లేకపోవడం, ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ చేయుటకు ఎటువంటి సిబ్బంది లేకపోవడంతోనే ఈ కూడలిలో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదకర కూడలితో పాటు పురుషోత్తపురం ఇంటిగ్రేటేడ్ చెక్‌పోస్టు, సుమండి కూడళ్లతో పాటు పట్టణంలోని సంతపేట వద్ద ఉన్న మలుపుల వద్ద అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మలుపుల వద్ద గమనించకుండా వెళ్లేవారు చాలామంది ప్రమాదాలబారినపడి ప్రణాలు కోల్పోవడం, అంగవైకల్యానికి గురికావడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. సంతపేట మలుపు వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైన అధికారులు దృష్టిసారించి ప్రమాదకూడళ్లు, మలుపులు వద్ద స్పీడ్‌బ్రేకర్లు, సూచీబోర్డులు, విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం



ఇచ్ఛాపురం పోలీసు సర్కిల్ పరిధిలో రోడ్ ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లను గుర్తించాం. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా వాహనదారుల్లో చైతన్యం తీసుకొస్తున్నాం. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి, డ్రక్‌అండ్‌డ్రైవ్‌కు స్వస్తి చెప్పాలి.

-మీసాల చిన్నంనాయుడు, సర్కిల్‌ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి



ఇచ్ఛాపురంలో ప్రమాదకరంగా చాలా మలుపులున్నాయి. పట్టణం నుంచి మా గ్రామం ఈదుపురం వెళ్లాలంటే జాతీయరహదారిపై ఈదుపురం-బెల్లుపడ కూడలి దాటాలి. ఈ కూడలిని దాటాలంటే వాహనదారులంతా తికమక పడుతున్నాం. ఈ కూడలిలో ఇరుపైపులా ఎటువంటి సూచీబోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు లేవు. రాత్రి వేళల్లో ఈ కూడలి చీకటిగా ఉంటుంది. ఇక్కడ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి..

-రత్నాల రాజు, ద్విచక్రవాహన చోదకుడు, ఈదుపురం

వేగనియంత్రణ పాటించాలి



ఇచ్ఛాపురంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలకు అతివేగమే కారణం. ప్రమాదాల్లో అధికంగా యువత, విద్యార్థులే ఉన్నారు. మార్కెట్‌లో స్పోర్ట్స్ వేరియంట్ బైక్‌లు అధికంగా ఉన్నాయి. ఇటువంటి బైక్‌లు నడిపేటప్పుడు వేగనియంత్రణ పాటించడం ముఖ్యం. ఒడిశా-ఆంధ్రా సరిహద్దు కావడంతో పట్టణంలోకి ఒడిశా నుంచి వచ్చే ప్రైవేటు బస్సుల వేగం నియంత్రించాలి. పట్టణంలోకి ఓవర్‌లోడ్‌తో వస్తున్న వాహనాల రాకపోకలను నియంత్రించాలి.

- బమ్మ జగన్, ద్విచక్ర వాహనదారుడు, ఇచ్ఛాపురం

కోడ్ అమలులో పక్షపాతం!



టెక్కలిలో బహిరంగంగా కనిపిస్తున్న అధికార పార్టీకి చెందిన రాష్ట్ర, కేంద్ర మంత్రుల పేర్లతో ఉన్న బోర్డు



సంతబొమ్మాళి: నౌపడలో టీడీపీ నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీ

టెక్కలి/సంతబొమ్మాళి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అమలు చేసిన కోడ్ విషయంలో పంచాయతీ అధికారులు పక్షపాతం చూపిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో కేవలం ప్రతిపక్ష పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, నాయకుల బోర్డులపై మాత్రమే ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తూ అధికార పార్టీకి చెందిన నాయకుల ఫ్లెక్సీలు, బోర్డులపై కనీసం దృష్టి సారించడం లేదంటూ పెద్ద ఎత్తున విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన టెక్కలితో పాటు కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల్లో యథేచ్ఛగా అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, నాయకుల బోర్డులు దర్శనమిస్తున్నాయి. వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంతబొమ్మాళి మండలం నౌపడలో టీడీపీ నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీ దర్శనం ఇస్తున్నా వీటిని ఎవరూ తొలగించలేదు.

సామూహిక చిత్రగుప్త వ్రతాలు



సామూహిక చిత్రగుప్త నోముల్లో దంపతులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 11వ వార్డులోని నీలకంఠేశ్వరాలయంలో సామూహిక చిత్రగుప్త వ్రతాలను మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేదపండితులు తెన్నేటి తేజేశ్వరశర్మ అధ్వర్యంలో చిత్రగుప్త వ్రతాలతో పాటు పదహారు ఫలాలనోము, ఉప్పుగౌరి, పాలగౌరి, పెరుగుగౌరి, తాడుగౌరి నోములు చేశారు. 21 మంది దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

త్వం సూర్యం ప్రణమామ్యహం

రథ సప్తమి సందర్భంగా భక్తులు మంగళవారం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. సూర్య నామ స్తోత్రాలతో సూర్య భగవానుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇళ్లు, ఆలయాల్లో ఆదిత్యుడికి పూజలు చేశారు. పిడకలపై ఇత్తడి పాత్రలను ఉంచి పాలుపొంగించి పాయసం తయారు చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. వేకువజాము నుంచి సముద్రతీరాలకు వెళ్లి తలంటి స్నానాలు ఆచరించారు. టెక్కలి పాత జాతీయ రహదారిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్, లోకల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే పాఠశాలలు, పలు కార్యాలయాల్లో సూర్యనమస్కారాలు వేసి పూజలు చేశారు.

-సాక్షి నెట్‌వర్క్




టెక్కలిలో సూర్యనారాయణస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



టెక్కలి: సూర్యనారాయణస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



కవిటి: పుక్కళపాలెం సముద్రతీరంలో సప్తమి వ్రతాలను ఆచరిస్తున్న మహిళలు



సంతబొమ్మాళి: భావనపాడులో లింగానికి సూర్య కిరణాలు తాకుతున్న దృశ్యం



ఇచ్ఛాపురం: పతంజలి ఆశ్రమంలో సూర్యనమస్కారాలు చేస్తున్న యోగాసమితి సభ్యులు



నందిగాం: పెద్దతామరాపల్లి పాఠశాలలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



వజ్రపుకొత్తూరు రూరల్: జన సంద్రంగా మారిన అక్కుపల్లి తీరం



కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సూర్యనమస్కారాలు విద్యార్థినులు



ఇచ్ఛాపురం: శివానందగిరిపై సూర్యభగవానునికి హారతులిస్తున్న మహిళలు



వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు బీచ్‌కి పోటెత్తిన భక్తులు



సంతబొమ్మాళి: భావనపాడు తీరంలో పూజలు చేస్తున్న మహిళలు

చల్లదనం కోసం..



కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ఎండ తీవ్రత నుంచి రక్షణకు చల్లని పానియాల కోసం ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వేసవిలో విరివిగా లభ్యమయ్యే కర్బూజ పండ్ల విక్రయాలు ప్రారంభం కావడంతో వీటిని కొనుగోలు చేస్తూ దాహార్తి తీర్చుకుంటున్నారు. కిలో రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు.

- కవిటి

విద్యార్థినికి అభినందన



కాకినాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకామ్ విద్యార్థిని పడాల అక్ష ప్రతిభకనబర్చింది. దీంతో ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మతో పాటు అధ్యాపకులు మంగళవారం ప్రశంసించారు. రాష్ట్ర స్థాయిలో కళాశాలకు గుర్తింపు తీసుకువచ్చినందుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు వి.ల్యూక్‌పాల్, ఓ.కోటేశ్వరరావు, బి.సత్యన్నారాయణ, హేమరాజు, మల్లేశ్వరరావు, లోకేశ్వరరావు, తేజోవతి పాల్గొన్నారు.

-టెక్కలి

కేజీబీవీ సందర్శన



కంచిలి మండలం జాడుపూడి కేజీబీవీని ఎంపీడీవో వి.తిరుమలరావు మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్ నిర్వహణ, పిల్లల అకడమిక్ స్టాండర్డ్స్‌ను పరిశీలించారు. పది, ఇంటర్ విద్యార్థులకు త్వరలో జరగబోయే పరీక్షలపై సూచనలించారు. ఎంఈవో-2 కె. చిట్టిబాబు ఉన్నారు. అనంతరం బూరగాంలోని ఎరుకల బంద చెరువులో జరుగుతున్న ఉపా ధిహామీ పనులను పరిశీలించారు.

-కంచిలి

మోడల్ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కంచిలి: మఠం సరియాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు గత నెల 27 నుంచి 31వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించిన హ్యాకథాన్‌లో 'హాక్ టు ద ఫ్యూచర్'ఇన్నోవేటింగ్ ఫర్ పార్టిసిపేటరీ ఫ్యూచర్స్ కార్యక్రమంలో ప్రతిభకనబర్చారు. ఆరాధ్య పాణిగ్రాహి, శ్రద్ధాంజలి మహంతి, యాస్మిన్ చౌదరి, రితిక బడిత్య, శ్రద్ధాంజలి మహంతిలు రూపొందించిన పశువుల కాపరులకు ఉపయోగంగా ఉండే మానిటరింగ్ పరికరం ప్రాజెక్టును ఇక్కడ ప్రదర్శించారు. ఇది ఇన్నోవేషన్ చాంపియన్స్‌గా నిలిచింది. దీంతో ఐదుగురు విద్యార్థినులతోపాటు గైడ్ టీచర్ సత్యనారాయణను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తన నివాసం రామయ్యపుట్టుగలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఉన్నారు.

విద్యార్థికి సత్కారం



అభిజిత్‌ను అభినందిస్తున్న దృశ్యం

కవిటి: మెరిట్‌స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష (ఈఈఎంటీ 2025) ఫలితాల్లో కవిటి మండలం ముత్యాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్‌క్లాస్ విద్యార్థి జల్లు అభిజిత్ జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో విద్యార్థిని మంగళవారం ముత్యాలపేట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో ధనంజయ మజ్జి తదితరులు అభినందించి సత్కరించారు. రూ.ఎనిమిది వేల చొప్పున మెరిట్‌స్కాలర్‌షిప్‌ను విద్యార్థి అభిజిత్ పొందనున్నట్లు హెచ్‌ఎం శాంతి తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ జువాలజీ లెక్చరర్ పాతిన చంద్రశేఖరం, గ్రామపెద్దలు పాతిన పద్మనాభం, పొల్లాయి హేమారావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

మృతుల కుటుంబాలకు పరామర్శ



కూర్మారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలోని జలంత్రకోట పంచాయతీ మధుపురం గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు కడగల ధర్మారావు, పురుషోత్తపురం పంచాయతీ పరిధి బురదపాడు గ్రామానికి చెందిన పైల కూర్మారావు ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలను స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పార్టీ నేతలు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, పిసి పండా, రమేష్ గౌడో,సర్పంచ్ పైల తులసి, పైల త్రినాథ్‌రెడ్డి ఉన్నారు.

పారా వలంటీర్ల నియమాకానికి దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయం పరిధిలో పారా లీగల్ వాలంటీర్ల నియమాకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ సీహెచ్ హరిప్రియ మంగళవారం తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన వారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సేవా దృక్పథం కలిగిన ప్రభుత్వయేతర సభ్యులు, స్వయం సహాయక సభ్యులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల ఏడో తేదీలోగా దరఖాస్తులను కోర్టు పని వేళల్లో అందజేయాలన్నారు.

ఇంటి పట్టాల పరిశీలన

నందిగాం: మండల కేంద్రమైన నందిగాం గణేష్ కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల పట్టాలను రెవెన్యూ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. ఈ కాలనీలో గతంలో ప్రభుత్వం పేదలకు పట్టాలు మంజూరు చేసింది. అయితే వాటిలో కొంత మంది ఇళ్లు కట్టుకొని ఉండగా కొంత మంది పునాదులు వేసుకొని ఉన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు తహసీల్దార్ సోమేశ్వరావు 12 మంది సిబ్బందితో పరిశీలనకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారి వద్ద ఉన్న పట్టాలను పరిశీలిస్తున్నారు. పట్టాలను విధిగా చూపించాలని కోరుతున్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వవార్డు కాశీబుగ్గ అంబేడ్కర్ నగర్‌లో ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల ఏడో తేదీన చేపడుతున్న చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ మంగళవారం ఉదయం జరిగింది. ఎస్సీ వర్గీకరణ అమలుపై 'లక్ష డప్పులు వేల గొంతులు'ఒకే చోట జరగాలని మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు పోస్టర్ ఆవిష్కరించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం, మాదిగ కులసంఘం నాయకులు ఉర్నాన అప్పలరాజు, చెరకుపల్లి నేతాజీ, సోద భీమరాజు, బొబ్బిలి క్రిష్టారావు, దుబ్బ పాపారావు, ఉర్నాన శంకరరావు, లండ చంద్రయ్య, కోల సింహాచలం ఉన్నారు.